రక్షకులు

రత్తమ్మ కొడుకు ఊరు విడిచి పెట్టిపోయి మిలటరీలో చేరి పోయాట్ట.

ఆ భోగట్టా తెలియగానే "పీడ పోయింద"నుకొంది సరళ. పీడ పోయినప్పటికీ సరళకి సంతోషం మాత్రం లేకపోయింది. పీడపోతే పిశాచం పట్టుకుంది.

సరళకి రా....నగరం టెలిఫోన్ ఎక్స్చేంజిలో పని దొరికింది. ఊరు ఆమెకి కొత్త. అందుచేత నాలుగు రోజులపాటు తన స్నేహితురాలొకామె ఆ వూళ్ళో ఉంటే- ఆమె ఇంట్లో బసచేసి ఈలోగా సీతాపతిగారి వీధిలో ఓ చిన్న ఇల్లు అద్దెకు కుదుర్చుకొంది. తోడుగా ఉండటానికి తల్లిని రమ్మని ఉత్తరం రాసి, తల్లి వచ్చేక అద్దె ఇంటికి బస మార్చింది. ఆ ఇల్లు ఊరికి కొంచెం కొసలో ఉంది. కాని అద్దె తక్కువా, ఆఫీసుకి దగ్గరాను. తనూ తల్లీ- ఇద్దరూ ఉండటానికి ఇమ్ముగా, సదుపాయంగా ఉంది. ఊరు బాగుంది. ఉద్యోగం బాగుంది. బస బాగుంది.

అంతా బాగానే ఉంది. రత్తమ్మ కొడుకే బాగులేడు.

రత్తమ్మ కొడుకు బాగానే ఉంటాడు. చిన్నవాడూ, అందగాడూను. చూడ్డానికి లక్షణంగా ఉంటాడు. ఎటొచ్చీ ఉన్న చెడ్డ లక్షణం ఏమిటంటే మనిషిలో హెచ్చుపాలు చెడ్డతనం ఉండడమే ఆ చెడ్డ లక్షణం.

రత్తమ్మ కొడుకుని చూడగానే "రాక్షి వెధవ" అనుకొంది సరళ. సరళని చూడగానే "హాయ్ హాయ్" అన్నాడు రత్తమ్మ కొడుకు.

సీతాపతిగారి వీధిలోకి లేడిపిల్లలా వచ్చిపడింది సరళ. ఆ వీధి రాక్షి మూకకి తను పులిపిల్లనని తెలియచేసేడామెకి రత్తమ్మ కొడుకు. అప్పటి కప్పుడే పెద్ద రౌడీలకి శిష్యరికం చేసే 'స్టేజి' దాటిపోయి, పిల్ల రౌడీలకి పెద్దగా ఉండే స్టేజ్‌లోకి వచ్చేడు. వీధికి కొత్తగా వచ్చిన పిల్లకి "హాయ్ హాయ్"అని పేరు పెట్టేడు. ఆమె వెంట పడ్డాడు.

ఆ ప్రకారంగా వెంట తగిలి ఆఖరికో రోజున చెంగు పట్టుకున్నాడు రత్తమ్మ కొడుకు. గేవా కలర్ హాలీవుడ్ చిత్రం "ఎడారి వీరుడు" చూసి ఇంటికి వస్తోంది సరళ. కొంతదూరం దాకా స్నేహితురాలు తనతో కూడా వచ్చి, ఆమెను ఇంటిదగ్గర ఆమె విడిపోయింది. సీతాపతిగారి వీధి ఇంక అట్టే దూరం లేదు. అందుచేత రిక్షా ఎందుకనుకొని నడిచే వెళ్తోంది సరళ.

దగ్గరనే చూసుకొంది కాని దారంతా చీకటిగానూ నిర్జనంగానూ ఉంటుందని గుర్తుంచుకోలేదు సరళ. రాత్రి పదయింది. చిట్ట చీకటిగా ఉంది. రోడ్డుమీద జనసంచారం ఉన్నట్టుగాలేదు. అక్కడికి తీరా వచ్చేసరికి సరళకి భయం ముంచుకొచ్చింది.

దొంగ దయ్యాలు "ఒస్తోంది రోయ్ పిల్ల" అని లోలోపల నవ్వుకొంటూ పక్కలెగరేస్తూ చీకట్లో తచ్చాడు తున్నట్టనిపిస్తోంది. రోడ్డు పక్కని ఉండే చెట్లు ఆ చీకట్లో కనిపించడం లేదు. కాని వాటిలోంచి జారు జారు పాములు జారుతూన్నట్టుగా చప్పుడవుతోంది. ఆకాశంలో రొజ్జగాలి పిల్లలంతా పోయిన తల్లిలా ఏడ్చేచ్చి అగుతోంది. ఆగి ఆగి ఏడుస్తోంది. ఎదురుగా కొంచం దూరంలో ఏదో కొరివి దయ్యంలా కాల్తూ ఆరుతోంది. ఆరిపోయిందనుకొనేసరికి కాల్తూ మెరుస్తోంది. వెనకనుంచి

శవాలు నడిచి వస్తోన్నట్టుగా తప తపలాడే అడుగుల చప్పుడు విన వస్తోంది.

సరళ నిలబడిపోయింది. రుమాలు తీసి ముఖం తుడుచుకొందికి కూడా భయం చేత వీల్లేక నిల్చుండిపోయింది. ఆ భయానికి సబబూ, సంద్భరం లేదు. చూస్తోండగా మబ్బులు కమ్ముకొచ్చినట్టుగా కమ్ముకొచ్చింది. అంతలోనే మబ్బులు విడిపోయినట్టుగా వదలిపోయింది.

తను రోజూ నడచే రోడ్డే. తను రోజూ చూసే చెట్లే. భయం ఎందుకూ? ఇదే పగలైతే భయం ఉండదు కదా!

అదే పగలనుకొని నడిచేదామనుకొంది సరళ. అనుకొని నాలు గడుగులు వేసింది. ఇంతలో వెనకనుంచి వచ్చే అడుగులు జోరు జోరయేయి. జోరు జోరయి ఆమె దగ్గరికి వచ్చేయి. వచ్చేక, సరళ భుజం మీది చేయి పడింది.

సరళ కేక లేదామనుకొనే లోపున ఆమె నడుంచుట్టూ చెయ్యొకటి తిరిగింది. "నేనే హాయ్ హాయ్" అనే మాటలు ఆమె చెవిని పడ్డాయి.

"అమ్మో" అని కేక వేసింది సరళ.

ఆ విధంగా ఆమె కేక వేయగానే ఏం జరిగిందంటే, ఎదురుగా కొంచెం దూరంలో వున్న కొరివి దయ్యం, రవ్వలు ఎగిరేలా కొరివిని నేలకి వేసికొట్టి, పరిగెట్టి, పరిగెట్టి వచ్చి రత్తమ్మ కొడుకుని పిడికిలితో గుద్దింది. రత్తమ్మ కొడుకు ఒక్కక్షణం తటపటాయిస్తూ నిల్చొనే సరికి కొరివి దయ్యం రెండడుగులు వెనక్కి వేసింది. రత్తమ్మ కొడుకులో కదలిక లేకపోవడం చూసి మళ్ళీ ముందుకొచ్చింది. గర్జించింది. అప్పుడు రత్తమ్మ కొడుకు కొరివి దయ్యపు కడుపులో పిడికిలితో పొడిచి, కొరివి దయ్యపు మెడపట్టుకు లాగి, కొరివి దయ్యపు కాలిలో కాలువేసి తిప్పి, కొరివి దయ్యాన్ని నేలకి వేసి కొట్టి పారిపోయేడు. అంతా కూడా "ఎడారి

వీరుడు" సినిమాలో లాగే జరిగింది. అయితే ఇక్కడ హీరోయే కింద పడ్డాడు. విలనే నెగ్గుకుపోయేడు అదీ జరిగింది.

కిందపడ్డ కొరివిదయ్యం నెమ్మదిగా లేచి "అబ్బ, అబ్బ" అని ఆయాసం తీర్చుకొని, ఉన్నట్టుగానే ఉండి చెంగు చెంగున గెంతి ఆ చీకట్లో సరళబాలని కొట్టేయబోయింది. దెబ్బలు తప్పించుకొందికి సరళ కూడా అటూ ఇటూ గెంతుతూ "ఆగండాగండి. నేన్నేను", అంటూ తను రత్తమ్మ కొడుకును కాననీ, తను తనేననీ "వాడు పారిపోయేడు పారిపోయే" డనీ కేకలు వేసి చెప్పవలసి వచ్చింది. పులిపిల్ల తప్పించుకు పారిపోయిందనీ, లేడిపిల్ల అరుస్తోందనీ తెలుసుకున్నాక ఆ దయ్యాపిల్ల గంతులు మాని "అయామ్ సారీ, అయామ్ సారీ" అంది హూణ బాషలో.

విలన్ వదలిపోయినందుకూ, హీరో చేత దెబ్బలు తప్పినందుకూ "థాంక్యూ థాంక్యూ" అంది సరళ.

"ప్రమాదమేం జరగలేదు కద? నో డేంజర్ కద?"

"ఏం లేదు. రౌడీ వెధవ. మీకేం దెబ్బలు తగల్లేదు కద?"

"ఇక్కడ చిన్న దెబ్బ.... హమ్మ తగల్లేదు."

"అయామ్ సో సారీ."

"ఫర్లేదు, ఫర్లేదు."

"సమయానికి సరిగ్గా ఒచ్చి రక్షించేరు."

"రక్షించనూ? డ్యూటీ డ్యూటీ."

"మీకు చాలా థాంక్స్."

"ఉంచండి. ఫరవాలేదు. హమ్మ హమ్మ ఎవడా 'రోగు'?"

"రత్తమ్మ...."

"ఆడదా?"

"కాదు. రత్తమ్మ కొడుకు."

"కొడుకా?"

"అవును."

"ఎవరి కొడుకు?"

"రత్తమ్మ కొడుకు. ఒత్తి రౌడీ."

"రౌడీనా?"

"అవును."

"ఏం చేసేడు?"

"తన్నాలండీ అలాంటి వాళ్ళని."

"ఏం చేసేడు. కొట్టేడా?"

"కొట్టలేదు"

"మరేం చేసేడు?"

"..........."

"ఏం చేసేడు మరైతే?"

"..........."

"ఓహో"

"........" తెలివి తక్కువ మనిషిలా ఉన్నాడు.

"అవమానించేడా? రాస్కెల్ రాస్కెల్! వాడిపని పట్టిస్తానెండి. ఇప్పుడు కాదు. రేపు. మీరు సరళాదేవిగారు కదూ? అవునవును, నాకు తెలుసు. పదండి పదండి. ఇంటికి దిగబెట్టేస్తాను."

ఇద్దరూ నడిచేరు.

'అతికొంచెం' దూరంవరకూ అతను మౌనంగా ఉన్నాడు. తరువాత ఒక్కన ఆగిపోయేడు. సరళకూడా ఆగింది.

అది రోడ్డు జంక్షను. పక్క రోడ్డులో దూరాన్న ఓ దీపం ఉంది. దాని పల్చటి వెలుగులో అతణ్ణి కొంచెం క్యూరియస్‌గా చూసింది సరళ.

పొడుం రంగుది కాబోలు పంట్లాం. అమెరికన్ జాకెట్టు నీలపు రంగుది. అతనికి ముప్ఫయ్యేళ్ళుండవచ్చు. ఎవరో నెత్తిమీద కొట్టి పొట్టి చేసి నట్టుగా ఉన్నాడు. ఆ పొట్టితనం సహజంగా లేదు. అతని జుట్టు పొట్టి, అతని ముక్కుపొట్టి, మొత్తంమీద మనిషి కొంచెం వింతగా కనిపిస్తు న్నాడు. అంతకు ముందు అతన్నెప్పుడు చూసినట్టు గుర్తు రాలేదు సరళకి.

రోడ్డు జంక్షన్లో ఆగి, సరళ ముఖంలోకి చూస్తూ "నా పేరేవిటో తెలుసా మీకూ?" అని అడిగేడు. తొందరలో అతని మాట తొట్రు పడింది. ఆపదలో వున్న ఆడపిల్లకి సాయపడగలిగినందుకతను చాలా ఉద్రిక్తుడయి వున్నాడని తెలుస్తోంది.

"నా పేరేవిటో తెలుసా మీకూ?"

"తెలీదు. సారీ....కాని నా పేరెలా తెలిసింది మీకూ?"

"మిమ్మల్నెందుకు తెలీదూ?! బాగా తెలుసు. కాన్నాపేరు మీకు మీకు తెలుసా?"

నేనెవరో మీకు తెలుసా? నన్నెప్పుడైనా మీరు చూసేరా? నే నెవరో మీకు తెలిసుండక పోవచ్చు. నేను ఫలానా....అని ఆ వరసలో మాట్లాడ్డం లేదతను. తన పేరేమిటో తెలుసా అని అడుగుతున్నాడు.

"ఇదేమిటీ వరస?" అనుకొంది సరళ.

"నా పేరు తెలుసా?"

"తెలీదు." పేరు చెప్పడానికి చాలా ముచ్చట పడిపోతున్నాడే!

"చెప్పనా ?"

"చెప్పండి" దానికంత సస్పెన్సెందుకూ?

"ఆశ్చర్యపోతారు"

"ఎందుకూ?" వెర్రివాడు కాడుకద?!

"నా పేరు జాన్‌లూయీరావు" అని గంభీరంగా చెప్పి ప్రియం ఫెంటుగా చూసేడతను.

సరళకి ఏమనడానికీ తోచక "ఓహో" అంది.

పేరు విని ఏం చెయ్యమంటాడు? మూర్ఛపొమ్మంటాడా, ముద్దెట్టుకోమంటాడా?

"కానీ నేను క్రిస్టియన్ని కాను. I am not a christian. స్వచ్ఛమైన...." అని తనది స్వచ్ఛమైన ఏ వర్ణమో తెలియజేసేడు. ఇంకా చెప్తున్నాడు.

"మాట వింటే తెలుగువాణ్ణనుకోవచ్చుగాని, నోరు మెదపకుండా వుంటే నన్ను చూసి ఎవ్వడూ అనుకోడు తెలుగువాణ్ణని. ఇందాట్లా నన్ను చూసినప్పుడు మీరేమనుకున్నారు?"

"ఇందాట్లా చీకటీ, మీర్నాకు కనిపించనేలేదు" అంది సరళ.

"సరిగా చూస్తే తప్పక ఆంగ్లో ఇండియన్నని మీరుకూడా అనుకొనుందురు. ఎంతో మందన్నారు. అబ్బ! మీరచ్చంగా ఏంగ్లో ఇండియన్లా ఉంటారండీ" అని ఎన్నో సార్లన్నారు. అంతే కాదండోయ్. నన్ను చూసి ఓ రోజున గబగబ ఒచ్చేసేడు ఒహడు. ఉంగరాల జుట్టు. తెల్లగా పొడవుగా టిప్‌టాప్‌గా వున్నాడు. మెళ్ళో బంగారపు గొలుసు. దానికి చిన్న బ్యూటిఫుల్ శిలువ. గడగడ మాట్లాడేస్తున్నాడు. ఏంవిటి? మళయాళం!

"ఆహాఁ?"

"వాడు సీరియస్ క్రిస్టియను. నన్ను చూసి వాళ్ళ ఖజిన్ననుకున్నాడు. చూడండెలా అనుకున్నాడో, బావులేదూ?"

"బావుంది."

"తరవాత సారీసారీ అన్నాడు. ఫరవాలేదన్నాన్నేను. ఆ తర్వాత ఇద్దరం ఫ్రెండ్సయి పోయేం. మావాడిప్పుడు బొంబేలో వున్నాడు. ఫ్రెంచ్ ఫర్మ్‌కి మానేజరు."

"అలాగనా?"

"అంతేనండీ. సీరియస్ క్రిస్టియన్ననుకున్నారు, పార్సీ పిల్లాణ్ణను కున్నారు. కొంకణ్ బ్రాహ్మణ్ణనుకున్నారు, ఆఖరికి కూర్గు వాణ్ణనికూడా అనుకున్నారు నన్ను చూసి. తెలుగువాణ్ణని మాత్రం ఎవ్వరూ అనుకో లేదు! అదేమిటో?"

తెలుగువాళ్ళా కాకుండా మరోలా ఉన్నందుకు అతను మిక్కిలిగా మురిసిపోతున్నాడు; ఎక్కువగా సంబరపడుతున్నాడు. చేతులూపుతూ గడ గడ మాట్లాడుతూ మెల్లిగా నడుస్తూన్నవాడు మళ్ళీ టక్కున ఆగిపోయేడు.

"మీర్నాకు జాన్ లూయీరావు పేరెలా వచ్చిందో అడగరేం?" అంటూ సరళని తననావిధంగా ప్రశ్నించవలసిందిగా నిర్బంధించేడు. అడక్క తప్పదు. అంచేత అడిగింది సరళ.

"చెప్తా వినండి...." అంటూ చెప్పడం సాగించేడు. తల్లి గర్భ మందు తానున్నయప్పుడు ఆ తల్లి కాలుజారి ఏట్లో పడిందట. అప్పుడొక దొర ("ప్యూరింగ్లీష్ మన్") గప్పున ప్రవాహంలోకి దూకి ఆమెని పట్టుకు ఈదుకొచ్చి ఒడ్డుకు చేర్చి రక్షించేట్ట. అతనియెడల తమకుండే కృతజ్ఞతకి చిహ్నంగా తనకా దొరపేరు పెట్టేరుట తన తల్లిదండ్రులు.

"రెండు ఫర్లాంగులు కొట్టుకు పోయిందట మా మదరు పాపం! మా ఫాదరేం చెయ్యగల్డూ? నీరంటే అసలే భయం అతనికి. ప్యూర్మన్, ఆ గట్టుమీద నిల్చొని లబోదిబోమని కేకలేస్తూంటే, పాపం ఆ దొర_ మిస్టర్ జాన్‌లూయీ_ఆ కేకలు విని కారాపిమరీ ఒచ్చేట్ట. రావడం ఏంవిటి, సంగతి చూడ్డం ఏంవింటీ, ఏట్లోకి దూకడం ఏంవింటి! అంతా

హాఫే సెకన్!.... అతనే లేకపోతే మా మదరు లేకపోను, నేనూ లేక పోదును. మరిప్పుడు మిమ్మల్ని సేవ్ చెయ్యడానికెవరూ రాకనూపోదురు అ! హాహాహా!"

జాన్ లూయీరావుతో ఆ విధంగా పరిచయం అయింది సరళా దేవికి.

ఆ తరువాత కొద్ది రోజులకే తెలిసింది, రత్తమ్మ కొడుకు ఊరొదిలి పోయి మిలిటరీలో చేరేడన్న భోగట్టా.

రత్తమ్మ కొడుకు!

పీడపోయింది.

మరి, జాన్ లూయీరావు?

పట్టుకు వదలడంలేదు.

"రక్షించడం కాదుకాని పిశాచంలా పీడిస్తున్నాడు" ఎప్పుడు పడితే అప్పుడు ఇంటికొచ్చేస్తాడు. ఎక్కడ పడితే అక్కడ పలకరించేస్తాడు. పలకరించడంలో ప్రమాదమేమీలేదు. కాని పలకరించిన తరువాత ఇంతకీ వదలడు, అంతకీ వదలడు. గంట మాట్లాడితే అందులో ముప్పావు గంట తన గురించే చెప్పుకుంటాడు. ఆ విధంగా గంటల తరబడిమాట్లాడతాడు. తనిప్పుడే ఇంత బావున్నాడా? చిన్నప్పుడు ఇంకా బావుండేవాట్ట. "ఫోటో చూపిస్తానుండండి. యూరోపియన్ బేబీలా ఉండేవాణ్నో లేదో మీరే చెబురుగాని" తనెప్పుడూ డీసెంట్‌గా డ్రెస్ అవుతాట్ట. తనకి మంచి స్నేహితులున్నారట. 'షిప్పు సిగరెటు' తప్పించి మరోటి మరెప్పుడూ తను కాల్చడట. సింధీ షాపు వాడు తనకి మంచి ఫ్రెండట, అక్కడమంచి బ్రాసియర్స్ దొరుకుతాయట. "ఇద్దరం కల్సి వెళ్దాం"ట "రారా?"ట "ఎందుకురారూ?!"ట.

ఈ ప్రకారం సరళని పిచ్చెత్తించేసేడతను.

అతనికి తమాషా తమాషా "బడాయి"లున్నాయి.

తను తెలుగు వాళ్లా ఉండనని; తను ఆంగ్లో ఇండియన్లా ఉంటానని గర్వం; తనకి దొరపేరుందని డాబు; తను ఇంగ్లీషు బాగా మాట్లాడగలనని బడాయి; తనకి అరవ స్నేహితులున్నారని గొప్ప; తన నేస్తుడొకడు శ్రీనగర్లో ఉన్నాడని గర్వం; మిస్ మేరీని తనకి బాగా తెలుసునని డాబు; తన 'కజిను' పెంటకుప్ప జమీందారని బడాయి; తన చెల్లి పెళ్లికి తాము పదివేలు కట్నమిచ్చేమని గొప్ప. మహ్మద్ హసన్కీ మాధవీలతకీ జరిగిన పెళ్లి తన మధ్యవర్తిత్వమే లేకపోతే జరక్కనే పోనని గర్వం; తను అతి కాస్మాపాలిటన్గా ఉంటానని డాబు, తనది స్వచ్ఛమైన ఫలానా వర్ణమని బడాయి.

"రక్షించడం కాదుకాని ప్లేగులా పట్టుకున్నాడు."

అతను సరళని రకరకాలుగా బాధించడం ప్రారంభించేడు. గుట్టుగా ఉంచవలసిన విషయమే అయినప్పటికీ కొంతమంది "నా భార్య ఇలాగా, నా భార్య అలాగా" అని పది మందితోనూ చెప్పుకుంటారు. అటువంటి వాడు బాయీరావు. అయితే అతనికి భార్యలేదు. ఇంకా బ్రహ్మచారి. భార్య లేకపోతేనేం? సరళుంది కదూ! అందుచేత ఆమెగురించి ఆ విధంగా చాటడం ప్రారంభించేడు.

"రక్షించడం కాదుకాని జీడిమార్కులా ఒదల్చడం లేదు."

అతగాణ్ణి ఎలావదల్చుకోడం? బుర్ర బద్దలు కొట్టుకున్నా వదలడం లేదతను. ఆఖరికి, వీణ్నింక "తంతే తప్ప లాభంలేద"నే అభిప్రాయానికి వచ్చింది సరళ. అంతగా వేధించుకు తినేసేడామె నతను.

ఓ రోజున సర్వానికీ సిద్ధపడి కూర్చుంది సరళ. ఇవాళడు 'వా రావాలి. ఏదైన అసందర్భంగా మాట్లాడాలి, అప్పుడు పట్టించాలి వాడి పని' అనుకొని కూర్చుంది.

కాని జాన్ లూయీ ఆ రోజు రాలేదు; కనిపించలేదు. ఆ మర్నాడు కూడా కనిపించలేదు, మరి నాలుగు రోజులు వరసగా గడిచేయి. తరువాత ఓ సాయింకాలం సరళకి ఉత్తరం వచ్చింది. ఎవ్వరాసేరు? "వాడ్రాసేడు."

"నా ప్రియమైన సర్లా"తో ప్రారంభించేడు. "నీ ప్రియమైన జాన్"తో ముగించేడు. అతగాడికి కలకత్తాలో ఉద్యోగం అయిందట. తంతిమీద ఆర్డర్లు వచ్చాయట. అందుచేత పిట్ట మనిషితోనైనా చెప్ప వీల్లేకుండా మూడ్నిముషాల్లో మూటా ముల్లే సర్దుకొని పోవలసి వచ్చిందట. మళ్లీ "కలుసుకుంటాం తప్పక తప్పక తప్పక"ట. ఈలోగా అధమం వారానికి ఒక్క సారైనా జాబు రాస్తూండగలనని హామీ ఇవ్వగలడట.

కలకత్తా పోయేడు!

రక్షించేడు!

కాని, పోస్టు ద్వారా బాధించడం సాగించేడు. సరళకి ఇంట్లో చిత్తు కాయితాల బుట్ట ఒకటీ కూడా లేదు. అందుచేత ఆ ఉత్తరాలన్నిటినీ పొయ్యిలో పడేసేది. రోజులు నడవగా నడవగా ఉత్తరాల బాధకూడా తగ్గిపోయింది. పోయింది.

ఈ విధంగా కొన్నాళ్ళయింది. వాతావరణం ప్రశాంతంగా ఉంది. సరళకి ఎప్పుడైనా పీడకలొచ్చినప్పుడు తప్ప జాన్ లూయీరావు జ్ఞప్తికి రావడం లేదు. ఆమె జీవితం సాఫీగా హాయిగా సాగిపోతోంది. ఆమెకి లోకం నర్తనశాలలా ఉంది; ఆకాశం నీలపుగోపురంలా ఉంది; వెన్నెల మల్లెల పంటలా ఉంది; రోజులు రోజా పువ్వుల్లా ఉన్నాయి. మనుష్యులు అందరూ రత్తమ్మ కొడుకులు కాదు. మరి జాన్ లూయీరావు లేడు.

సరళకి నిజంగా చాలా హాయిగా ఉంది.

ఒక రోజున రాత్రి సుమారు పది గంటల సమయానికి అదే "చీకటిరోడ్డు"న సరళ ఇంటికి నడుస్తోంది. ఆ రోజున అది చీకటి రోడ్డు

మాత్రం కాదు. పక్కనున్న చెట్లు వెన్నెల ముసుగులు వేసుకున్నాయి. రోడ్డంతా వెన్నెల ముగ్గులు వేసుకొంది. సరళ నిర్భయంగా నడుస్తోంది. ఆమె బావ వస్తున్నానని ఉత్తరం రాసేడు. ఉత్తరం ఆమెకాదినమే అందింది. తెల్లవారితే వచ్చేరోజు అతను వచ్చేరోజు. తెల్లవారితే ఆమెకది శుభదినం. ఆమెకి చాలా సంతోషంగా ఉంది. పూల పరుపుమీద ఉన్నట్టుగా ఉంది. చెట్లతో రోడ్డు పందిరి వేసుకొంది. చంద్రుడు ఏ క్షణానికో పందిరి కిందకొచ్చే పెళ్ళికొడుకులా ఉన్నాడు. తారలు తెలిమబ్బుల మధుపర్కాలు కట్టుకొంటున్నాయి. ఎక్కణ్ణించో సన్నని సన్నాయివాయిద్యం వినపస్తోంది.

సరళ అందుకే అంతగా నవ్వుకొంటూ నడుస్తోంది. పాటలూ, పువ్వులూ, పెళ్ళిళ్ళూ వాటి గురించి ఆలోచించుకొంటూ నడుస్తోంటే మీద నుంచి తేళ్ళూ జెర్రులూ పడ్డట్టు "హలో సర్లా" అనే మాటలు ఆమె చెవిని పడ్డాయి.

తుళ్ళి పడింది సరళ.

ఆ తుళ్ళిపడ్డంలో ఆమె తొడుక్కున్న జోడుకింద, కట్టుకున్న చీరకుచ్చెళ్ళు చిక్కుకున్నాయి. ఆమె ముందుకు తూలి పడిపోలేదు. తూగి పడబోయింది. ఇంతలో జాన్ లూయీరావు వచ్చి ఆమెని పట్టుకున్నాడు.

జాన్ లూయీరావు ఆ రోజునే వచ్చేడు కలకత్తానుంచి. రాగానే సరళ కోసం ఆమె ఇంటికి వెళ్ళేడు. ఆమెలేదు. రాత్రి పదింటికి కాని ఇంటికి రాకపోవచ్చని తెలుసుకున్నాడు. ఈలోగా బజారంతా తిరిగి, క్లబ్బుకి వెళ్ళి, కనిపించిన పరిచయుణ్ణల్లా వీలైనంతగా పీడించి, హుషార్‌గా తిరిగి వస్తున్నాడు. వస్తూ ఆమె గురించే ఆలోచిస్తున్నాడు. ఆమెని చూదామని తహతహ లాడుతున్నాడు. "వియోగం వల్ల" అత

గాడికి అసలే ఎక్కువగా ఉంది ఉద్రేకం. ఆమెనా సమయంలో అక్కడ చూసేసరికి మరీ ఎక్కువయింది. ఆమె పడబోవడం కాదుకాని ఆమెనతను పట్టుకోవలసి వచ్చింది. ఆమెనా విధంగా తాకేసరికి అతను ఒళ్ళు మర్చిపోయేడు. అతనికి మతి పూర్తిగా పోయింది. ఆ మతిపోవడంలో ఆమెని దగ్గరగా తీసుకొని ఏమేమో అనడం మొదలుపెట్టేడు.

సరళకి మాత్రం పోలేదు.

"ఒదులు. ఒదుల్తావా ఒదలవా?" అని కేకలు వేసింది. వేసి విడిపించుకుంది. విడిచేవరకూ పిడికిళ్ళతో గుద్దింది. విడిచేక చెంపపెట్టు వేసింది.

ఆడపిల్లచేత లెంపకాయ తిన్న పిమ్మట ఏం చెయ్యడమో తెలియక వెర్రినవ్వు నవ్వబోయి నవ్వలేక నిల్చున్నాడు జాన్ లూయీరావు.

ఇంతలో ఆడపిల్లని ఆపదనుంచి రక్షించేదామని, ఎక్కణ్నించి వచ్చేడోకాని, మిలిటరీ దుస్తుల్లో ఉన్న వ్యక్తి ఒకతను అక్కడికి వచ్చేడు. వస్తూనే జాన్ లూయీరావుకి రెండు తగలనిచ్చేడు. తోడనే సరళనుద్దేశించి అడిగేడు_"ఎవడు వీడు? ఏం చేస్తున్నాడు మిమ్మల్ని? ప్రమాదమేం జరగలేదుకద? హాయ్! మీరు సరళాదేవి కదూ?"

ఈ విధంగా సరళని రక్షించిపారేయడానికి వచ్చిన ఇతగాడెవరు? సెలవుమీద ఇంటికొచ్చిన రత్తమ్మ కొడుకా? ఎవరు? ఎవడో ఒకడు. 'అయినా ఎవడో చెప్పకూడదూ?'

రత్తమ్మ పుత్రుడో, రాజన్ చంద్రుడో, రహ్మాన్ ఖానుడో. జాన్సన్ 'రొనాల్డో' ఎవడైనా సరే.

"మీ సాయం నా కక్కర్లే"దని విసవిస నడచి వెళ్ళింది సరళాదేవి.

ఆంధ్రపత్రిక—సచిత్రవారపత్రిక.

2-10-1957